

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు

మంత్రులను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడానికి సహకరించిన మంత్రులకు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీహెచ్ భాస్కరాచారి, డైరెక్టర్లు అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నర్సింహ, మధుసూదన్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ముంపునకు గురైన అయ్యప్పకాలనీలో పర్యటన

మన్సూరాబాద్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన నాగోల్ డివిజన్ పరిధిలోని అయ్యప్పకాలనీని జీహెచ్ఎంసీ ఏఈ బొబ్బిలి లక్ష్మీదీపక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయినగర్ చెరువుకు కాలనీ ఆనుకుని పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండడంతోనే వర్షాలకు అయ్యప్పకాలనీ ముంపునకు గురైందని పేర్కొన్నారు. ముఖ్యంగా నిర్మించబడిన బాక్స్ డ్రెయిన్ లెవల్ సబ్‌లేన్‌ల కంటే ఎక్కువగా ఉండటం, ఇటీవల చేపట్టిన డ్రైనేజీ పనుల కారణంగా రోడ్లు దెబ్బతినడం కారణంగానే ఈ సమస్య నెలకొందన్నారు. బాక్స్ డ్రెయిన్, సీసీ రోడ్లను కలుపుతూ అదనంగా క్యాచ్ పిట్‌లను ఏర్పాటు చేయడంతో సమస్యను పరిష్కరించవచ్చని ఏఈ తెలిపారు. ఈ పర్యటనలో ఈఈ ఆశలత, డీఈ దామోదర్, డబ్ల్యూఐ శ్రీనివాస్ ఉన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి తదితరులు

ఆర్కేనగర్‌లో స్వచ్ఛత సేవ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ(జీఎస్ఐటీఐ) బండ్లగూడ ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆర్కేనగర్‌లో స్వచ్ఛత సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్. మాథ్యూ జోసెఫ్, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆర్కేనగర్, వనస్థలిహిల్స్ రోడ్డులో చెత్తను శుభ్రం చేశారు. అనంతరం వారందరితో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. శానిటేషన్ సిబ్బందికి గిఫ్ట్‌లను అందజేశారు. కౌన్సిలర్లు కోటేశ్వరరావు, పరశురాం, దేవిడి గీతావేణుగోపాల్‌రెడ్డి, అర్చనదామోదర్, సీనియర్ జియాలజిస్ట్ మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంజిరెడ్డినగర్‌కాలనీ సంక్షేమ సంఘానికి చెత్త సేకరణ కోసం రిక్షాను అందజేస్తున్న బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్

కాలనీలో చెత్త సేకరణ కోసం రిక్షా పంపిణీ

చంపాపేట, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని అంజిరెడ్డినగర్ కాలనీలో చెత్త సేకరణ కోసం రిక్షాను బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్ కాలనీ సంక్షేమ సంఘానికి గురువారం అందజేశారు. చెత్త సేకరణ కోసం ఇటీవల కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరిన మేరకు రిక్షాను అందజేసినట్లు రవిముదిరాజ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా ఇంటింటికీ వచ్చే రిక్షాలో తడి, పొడి చెత్తను వేరుచేసి అందులో వేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కాలనీ ప్రతినిధులు సందీప్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ రఘు నిజాయితీ

- దొరికిన పర్సును బాధితురాలికి అప్పగించిన ఏఎస్ఐ



పోగొట్టుకున్న పర్సును బాధితురాలికి అప్పగిస్తున్న ట్రాఫిక్ ఏఎస్ఐ రఘు

హయత్‌నగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సూర్యానగర్ కాలనీలో నివాసం ఉండే వినోద పని మీద ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుంది. గురువారం ఉదయం హయత్‌నగర్ బస్ స్టాండ్‌లో బస్సు దిగిన వినోద పర్సు కుంట్లూర్ చౌరస్తా వద్ద పడిపోయింది. ఆ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న వనస్థలిపురం ట్రాఫిక్ ఏఎస్ఐ రఘు రామగిరికి దొరికింది. పర్సు పోగొట్టుకున్న వినోద పర్సును వెతుకుంటూ అక్కడికి వచ్చింది. అది గమనించిన రఘు ఆమెను పిలిచి వివరాలు అడిగి తెలుసుకుని పర్సును అప్పగించారు. పర్సులో వినోద ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్, వెయ్యి రూపాయలు ఉన్నాయి. పోయిందనుకున్న పర్సును ట్రాఫిక్ పోలీసు తిరిగి ఇవ్వడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఏఎస్ఐ రఘు నిజాయితీని పలువురు అభినందించారు.

ముగిసిన ఉచిత పరికరాల పంపిణీ అర్హత పరీక్ష



ఉచిత పరికరాల పంపిణీ అర్హత పరీక్షకు హాజరైన మానసిక దివ్యాంగులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేంద్ర సామాజిక సాధికారత మంత్రిత్వశాఖ సహకారంతో అలీంకో సంస్థ రెండు రోజులుగా నిర్వహించిన ఉచిత పరికరాల పంపిణీకి అర్హత పరీక్ష గురువారం ముగిసింది. ఉచిత అర్హత పరీక్షకు 120 మందికి పైగా మానసిక దివ్యాంగ విద్యార్థులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకుడు సీ.రమేష్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగ విద్యార్థుల కోసం భారత ప్రభుత్వం ఉచితంగా అందజేసే పరికరాలైన వీల్‌చైర్లు, హియర్‌మిషన్, ఎలక్ట్రికల్ వస్తువులు పొందడానికి నిర్వహించిన అర్హత పరీక్షకు పెద్ద సంఖ్యలో మానసిక దివ్యాంగులు హాజరు కావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అలీంకో సంస్థ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్ రఘు తదితరులు



కొత్తపేట చౌరస్తా సమీపంలోని బీజేఆర్ భవన్ వద్ద చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు



తుర్కయంజాల్ స్వామి వివేకానంద చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్ కొశిక ఐలయ్య, యాదగిరి, అంజయ్య, హనుమంత్‌గౌడ్, సాయిరెడ్డి, రాముగౌడ్, రాజునాయక్, శేఖర్‌యాదవ్

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



సరూర్‌నగర్ చావిడి వద్ద చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, విద్యావంతుల వేదిక హైదరాబాద్ కార్యదర్శి రమణ తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జి.రఘు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ధీరత్వాన్ని వారు కొనియాడారు. కార్యక్రమం లో కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, ఏనుగు రాంరెడ్డి, సుక్క శివకుమార్, నిమ్మ ల సునీతాశ్రీకాంత్ గౌడ్, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ జ్యోతీరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్ : కొత్తపేట చౌరస్తా సమీపంలోని బీజేఆర్ భవన్ వద్ద యువజన కాంగ్రెస్ నాయకుడు పెద్దపూర సైదులు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్, తలాటి రమేష్, జ్ఞానేశ్వర్, ఎల్లన్న, లింగస్వామి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

సరూర్‌నగర్ చావిడి వద్ద సరూర్‌నగర్ రజక సంఘం అధ్యక్షుడు దత్తాత్రేయ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తెలంగాణ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, విద్యావంతుల వేదిక హైదరాబాద్ కార్యదర్శి పగడాల రమణ, రజక సంఘం నాయకులు అంజయ్య, ధన్‌రాజ్, దశరథ పాల్గొని నివాళులర్పించారు.

చంపాపేట : చంపాపేటలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి శ్రీపాల్‌రెడ్డితో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈపూరి బద్రీనాథ్, తేకటి కిరణ్, కారుకొండ శివ, గడ్డం వెంకటేష్, పబ్బు జంగయ్య, మలిదశ ఉద్యమకారులు రాము, రామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చంపాపేటలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, వింజమూరి రాఘవాచారి, బొక్కా సదానంద్‌రెడ్డి తదితరులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, నాయకులు చేగోని మల్లేష్‌గౌడ్, బొంబాయి, మహేష్, చందూయాదవ్, రమాదేవి, జగదీష్‌గౌడ్, సత్తిరెడ్డి, జంగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

చింతలకుంట చెక్‌పోస్ట్‌లో..

వనస్థలిపురం: ఐలమ్మ జయంతి వేడుకలను వనస్థలిపురం డివిజన్ చింతలకుంట చెక్‌పోస్ట్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బోయపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్, మదిలేటి, పూజారి అనిత, శోభ, పార్వతమ్మ పాల్గొన్నారు.

నాగోల్ చౌరస్తాలో..

మన్సూరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చైతన్యంతో ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం నాగోల్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథి విచ్చేసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం కన్వీనర్ బొడ్డుపల్లి కృష్ణ, రజక అభివృద్ధి సంస్థ సహాయ కార్యదర్శి చుక్కయ్య రవీంద్రచారి, రమేష్, శ్రీకాంత్, వినయ్, కార్తీక్, చైతన్య, సంజీవ, మల్లేష్, కటకం శ్రీనివాస్, వీరేందర్ పాల్గొన్నారు.



చింతలకుంట చెక్‌పోస్ట్ వద్ద ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు బాతరాజు నర్సింహ, రాములుగౌడ్, మదిలేటి

కుంట్లూర్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నవనీత, మధు, నారాయణరెడ్డి, సైదులు, నిరంజన్, యాదగిరి, సుజాత, వీరేస్, గణేష్ పాల్గొన్నారు.

మోహన్‌నగర్ చౌరస్తాలో..

కొత్తపేట: కొత్తపేట మోహన్‌నగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, నాయకులు రాజేష్, వజీర్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు పరిధిలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ కొశిక ఐలయ్య హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యాదగిరి, అంజయ్య, హనుమంత్‌గౌడ్, సాయిరెడ్డి, రాముగౌడ్, రాజునాయక్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.



కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



నాగోల్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు



కొత్తపేట మోహన్‌నగర్ చౌరస్తాలో ఐలమ్మకు నివాళులర్పించిన మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి గీతారెడ్డి



చంపాపేటలో నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు రాజ్‌కుమార్‌రెడ్డి, రవి, సదానంద్‌రెడ్డి, రాఘవాచారి

వ్యాపారాలు కొనసాగించడానికి అనువైన ప్రదేశం చూపించాలి

- రైతుబజార్ పూలు, పండ్ల వ్యాపారులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రైతు బజార్ రోడ్డులో అధికారులు పూలు, పండ్ల సముదాయాలను కూల్చివేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని, తక్షణమే తమకు వ్యాపారాలు కొనసాగించడానికి అనువైన ప్రదేశం చూపించాలని వ్యాపారులు గురువారం రైతుబజార్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ ఇరువై ఏళ్లుగా వనస్థలిపురం రైతుబజార్ వద్ద పూలు, పండ్ల వ్యాపారాలు చేసుకుంటు జీవనం సాగిస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య పేరుతో తమ వ్యాపారాలను అకారణంగా తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు. తమ వ్యాపారాలను తిరిగి కొనసాగించడానికి రైతుబజార్ సమీపంలోని అనువైన ప్రదేశాన్ని చూపించి తమను ఆదుకోవాలని సంబంధిత అధికారులను వారు కోరారు.



రైతుబజార్ వద్ద ఆందోళన చేస్తున్న పూలు, పండ్ల వ్యాపారులు

కార్యక్రమంలో వ్యాపారులు వెంకటేష్, రిషి, పాండురంగారావు, కేసీఎన్ రావు, కోటేశ్వర్, శ్రీను, లలితాదేవి, పార్వతమ్మ, జయమ్మ, వరలక్ష్మి, అలివేలు, అంజమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సరూర్‌నగర్ స్టేడియంలో యోగాథాన్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో యోగాశాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉన్నదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఐఎంసీటీఎఫ్ ఆధ్వర్యంలో యోగథాన్ ఘనంగా నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నవంబర్‌లో నిర్వహించనున్న హెచ్ఎస్ఎస్ఎఫ్, ఐఎంసీటీఎఫ్ ఫెయిర్‌కు అనుబంధంగా ప్రీ ఫెయిర్‌గా దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగల సత్తా భారతీయ యోగా శాస్త్రముకు ఉన్నదన్నారు. నేటి విద్యార్థులు, యువత ఎంతో ఒత్తిడికి లోనై



యోగాథాన్‌లో పాల్గొన్న అతిథులు



విద్యార్థుల ప్రదర్శన

ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కార్పొరేట్ స్థాయిలో ఎంతో మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు విధి నిర్వాహణలో ఒత్తిడికి లోనై ఆరోగ్యాన్ని కోల్పోతున్నారన్నారు. అన్నింటికి పరిష్కారం ఒక్క యోగాతోనే సాధ్యమన్నారు. అందుకే భారత ప్రధాని మోదీ జూన్ 21న ఇంటర్నేషనల్ యోగా డేగా నిర్ణయించేలా కృషి చేశారన్నారు. మానసిక ఆరోగ్యం యోగాతోనే సాధ్యమన్నారు. ఏకాగ్రత సాధన, పంచేంద్రియాలను అదుపులో ఉంచడం, కామ క్రోధాది అరిషడ్వర్గాలను జయించుట వంటి ఎన్నో ప్రయోజనాలు యోగా ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి సత్యారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీ నిరంజన్, యోగా టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జాతీయ లోక్ అదాలత్'



మాట్లాడుతున్న న్యాయమూర్తులు సురేష్, అరుణకుమారి

ఎల్బీనగర్ : హైదరాబాద్ క్రిమినల్ కోర్టు పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 28న 'జాతీయ లోక్ అదాలత్' ని ర్వహిస్తున్నట్లు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, న్యాయమూర్తి సురేష్ తెలిపారు. నాంపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఈ-పెట్టీ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, ఈ-పెట్టీ కేసులతో పాటు ఇతర పెండింగ్ కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. పరిష్కరించుకున్న కేసులకు అప్పీల్ ఉండనందున కక్షిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. సమావేశంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి అరుణకుమారి పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో కాలనీలను ముంచేసిన వరద

- బీజేపీ క్వార్టర్స్ వద్ద ట్రంక్‌లైన్‌లో బండరాళ్లు అడ్డు పడడమే కారణం
- మిథిలానగర్, సత్యసాయినగర్‌లలో నీట మునిగిన నివాస గృహాలు



మిథిలానగర్‌లో నిలిచిన వరద నీరు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మిథిలానగర్, సత్యసాయినగర్‌లను గురువారం తెల్లవారు జామున వరద నీరు అకస్మాత్తుగా ముంచేసింది. ఎగువన గల పెద్దచెరువు, మంత్రాలచెరువుల్లోకి వెళ్లాల్సిన వరద నీటిని నేరుగా ట్రంక్‌లైన్ ద్వారా మళ్లించడంతో బీజేపీ క్వార్టర్స్ వద్ద ఓవర్ ఫ్లో తలెత్తి మిథిలానగర్, సత్యసాయినగర్ కాలనీల్లోకి ప్రవహించింది. ఇక్కడ గతంలో నిర్మించిన ట్రంక్ లైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు బండరాళ్లు సైతం అడ్డం పడడంతో వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లలేక సడన్‌గా కాలనీల్లోకి మళ్లింది. తెల్లవారు జామున ఈ సంఘటన చోటుచేసుకోవడంతో నివాస గృహాల్లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ట్రంక్‌లైన్‌ను పరిశీలించగా అక్కడ ఓవర్ ఫ్లో అయినట్లు తేలింది. వెంటనే మీర్‌పేట్ మునిసిపల్ అధికారులకు సమాచారం అందించగా, అధికారులు డీఆర్ఎఫ్ విభాగానికి విషయం చెప్పారు. అక్కడి నుంచి వచ్చిన రెండు బృందాలు ట్రంక్‌లైన్ వద్ద ఇసుక బస్తాలు అడ్డుగా పెట్టి వరద నీరు కాలనీల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ట్రంక్‌లైన్‌లోని చెత్తా చెదారం, బండరాళ్లను సైతం తొలగించారు. దాంతో ఎగువ నుంచి వచ్చిన వరద సాఫీగా దిగువకు ప్రవహించింది.



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న సీపీ అవినాష్ మహంతి

ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేలా చర్యలు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలకు తగిన విధంగా ట్రాఫిక్ నిర్వహణ జరగాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉన్న జేఎన్‌టీయూ, యశోద ఆర్అండ్‌బీ రోడ్, సిద్ధివినాయక నగర్, మాదాపూర్, ఎస్ఐఏ సర్వీస్ రోడ్ తదితర ప్రాంతాల్లో జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్ సక్రమంగా సాగేందుకు, అడ్డంకులను తొలిగించేందుకు జీహెచ్ఎంసీ, విద్యుత్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కార్యాచరణ రూపొందించాలని ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి సూచించారు.

కేసులున్నాయంటూ బెదిరించి రూ 1,49,000 దోచుకున్నారు

కొత్తపేట, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): కేసులున్నాయంటూ బెదిరించి ఎల్బీనగర్ వ్యాపారి నుండి సైబర్ నేరస్థులు రూ. 1,49,000 దోచుకున్నారు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ ఎస్బీహెచ్ కాలనీలో ఉండే ఏ.మధుసూదన్‌రెడ్డి(35) వ్యాపారి. ఈనెల 25న ముంబయ్ నుండి గుర్తు తెలియని వ్యక్తులు కాల్‌చేసి, ట్రాయ్ నుండి చేస్తున్నామని మొబైల్ నెం. బ్లాక్ చేస్తున్నామని హెచ్చరించారు. అంతేగాక ఆ ఫోన్ నెంబర్, నెంబర్ కలిగిన వ్యక్తి పేరూ ఫ్రాడ్ లిస్టులో ఉన్నాయని, 17 నాన్ బెయిలబుల్ వారంట్ విడుదల చేశామంటూ బెదిరించారు. తర్వాత అతడికి వాళ్ల వీడియోకాల్ చేసి, బ్యాంక్ అకౌంట్ బ్లాక్ చేస్తామని రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం డబ్బు బదిలీ చేయాలని హెచ్చరించారు. ఇదంతా నిజమేనేమోనని భయాందోళనలకు గురైన మధుసూదన్‌రెడ్డి రెండు విడతలుగా రూ. 1,49,000లు వారిచ్చిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. తర్వాత తాను మోసపోయానని గుర్తించాడు. గురువారం రాత్రి బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మంగళసూత్రం చోరీ



దొంగతనం జరిగిన తీరును బాధితురాలిని అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

హయత్‌నగర్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి మంగళసూత్రాన్ని లాక్కెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన లక్ష్మి ఆధార్ సెంటర్ వద్ద నివాసం ఉంటుంది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి రాత్రి 9:45 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె వెనక నుంచి నడుచుకుంటూ వచ్చి మెడలో ఉన్న మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కుని వెళ్లాడు. మరో యువకుడు బైక్‌తో ముందు సిద్ధంగా ఉండడంతో ఇద్దరు కలిసి పారిపోయారు. సమాచారం అందుకున్న హయత్‌గర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. మంగళసూత్రాన్ని లాక్కుని పరిగెత్తుతున్న దృశ్యం సీసీ ఫుటేజీలో నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.